
సాక్షి
పల్నాడు
సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,236 క్యూసెక్కులు విడుదలయ్యాయి.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.1097 టీఎంసీలు. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.


కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 558.60 అడుగుల వద్ద ఉంది. ఇది 229.1358 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 8,221, ఎడమ కాలువకు 8,986 ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 19,927 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 14,573 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 834.90 అడుగుల వద్ద ఉంది. ఇది 54.9477 టీఎంసీలకు సమానం.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలు ప్రారంభం



నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో భాగంగా ఆదివారం 66వ రాష్ట్ర స్థాయి అండర్–17, అండర్–19 బాలబాలికలకు సైక్లింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను వినుకొండ ఎంపీపీ పగడాల జయలక్ష్మీ వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల కోసం మండల పరిధిలోని అచ్చమ్మపాలెం నుంచి కోటప్పకొండ వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేశారు. అండర్–17 విభాగంలో 10 కిలోమీటర్లు, అండర్–19 విభాగంలో 18 కిలోమీటర్ల దూరం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 115 మంది బాలబాలికలు పోటీలకు హాజరైనట్టు ఫెడరేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. పోటీలకు పరిశీలకులుగా వెంకయ్య, ఎం.గోపి హాజరవగా కనకారావు షాప్ కోచ్‌గా సహకారం అందించారు.

ఉత్కంఠగా షూటింగ్ బాల్ పోటీలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు ఆదివారం ఉత్కంఠభరితంగా సాగాయి. నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 41వ రాష్ట్ర స్థాయి పోటీలకు వందలాది మంది క్రీడాకారులు తరలివచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 జిల్లాలకు చెందిన బాలుర జట్లు, 16 జిల్లాలకు చెందిన బాలికల జట్లు పోటీల్లో తలపడ్డాయి. ఆయా జిల్లా జట్ల మధ్య లీగ్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. అనంతరం క్వార్టర్స్, సెమీ ఫైనల్ పోటీల్లో బాలురు, బాలికల జట్లు విశేష ప్రతిభను కనబర్చి ఉత్కంఠకు తెరలేపాయి. నువ్వానేనా అన్నట్లు సాగిన ఫైనల్ మ్యాచ్‌లు ఏలూరు, గుంటూరు, విశాఖపట్నం, అనంతపురం, బాపట్ల, విజయనగరం జిల్లా జట్ల మధ్య రసవత్తరంగా జరిగాయి. ఆయా జట్ల క్రీడాకారులు ఒకరిని మించి మరొకరు అబ్బుర పరిచే ప్రతిభను చాటారు. నెల్లూరు జిల్లా జట్టు విజేతగా నిల్చి చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. గుంటూరు, విజయనగరం జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సొంతం చేసుకున్నాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. నెల్లూరు, అనకాపల్లి జిల్లాల జట్లు ఆ తర్వాతి స్థానాల్లో నిల్చాయి. పోటీల నిర్వహణకు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ వైస్ చైర్మన్ లంబు వెంకట శివన్నారాయణ అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. విజేతకు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సంయుక్త కార్యదర్శి కూచిపూడి జోసఫ్ చేతుల మీదగా ట్రోఫీలను అందజేశారు. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ నాగ వెంకట దుర్గాప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

మిషన్ శోభకృత్

- సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
- రానున్న శోభకృత్ నామ సంవత్సర ప్రారంభం (ఉగాది) నాటికి అన్ని కార్యాలయాల్లో వ్యర్థాలు తొలగించేలా ప్రణాళిక
- వేలంలో పాత సామగ్రి, వాహనాలను విక్రయించడంతో పాటు శిథిల భవనాలను కూల్చనున్న అధికారులు
- ఉగాది నాటికి అన్ని కార్యాలయాలను వ్యర్థరహితంగా మారుస్తామంటున్న కలెక్టర్ శివశంకర్



సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పాత వాహనం చుట్టూ చెత్తాచెదారం

సాక్షి, నరసరావుపేట: రానున్నది శోభకృత్ నామ తెలుగు సంవత్సరం. శోభకృత్ అనగా శోభను కలిగించేది. శోభకృత్ నామ సంవత్సర ప్రారంభం (ఉగాది) నాటికి పల్నాడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా మార్చి శోభాయమానంగా తీర్చి ప్రజలకు స్వాగతం పలకాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఓ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దానిపేరు 'మిషన్ శోభకృత్'. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించనున్నారు. ఇందుకోసం ఓ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు. యుద్ధప్రాతిపదికన అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని ఉగాదిలోగా అన్ని కార్యాలయాలను స్వచ్ఛీకరించనున్నారు.

నాలుగు విభాగాలుగా..

మిషన్ శోభకృత్‌ను ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. దీన్ని నాలుగు భాగాలు విభజించారు. కార్యాలయంలో ఉన్న అన్ని రకాల వ్యర్థాలను తొలగించడం, పనికిరాని పాత వాహనాలను విక్రయించడం, శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చడం, కాలపరిమితి దాటిన అనవసర కాగితాలను కాల్చడం. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయిలో ఎంపీడీఓ, మున్సిపాలిటీలో కమిషనర్, డివిజనల్ స్థాయిలో డీఎల్‌పీఓ, జిల్లా స్థాయిలో డీఆర్‌ఓ ఈ మిషన్ శోభకృత్‌ను పర్యవేక్షించనున్నారు. తొలుత జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఓ ఫార్మేట్‌ను పంపనున్నారు. అందులో వారి కార్యాలయంలో ఏ విధమైన వ్యర్థాలు ఉన్నాయో, ఎంత పరిమాణంలో ఉన్నాయో తెలపాల్సి ఉంటుంది. ఈ నెల 23లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

వేలం ద్వారా విక్రయం..

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న పాత కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లు, కంప్యూటర్లు వంటి అన్ని రకాల వ్యర్థాలను గ్రామాలు, మండలాల నుంచి డివిజన్ స్థాయిలో ఈ నెల చివరి నాటికి ప్రత్యేక వాహనాల ద్వారా ఓ చోటకు చేర్చనున్నారు. వీటిని బహిరంగ వేలం ద్వారా విక్రయించి ఆదాయం పొందనున్నారు. కార్యాలయాల్లో వినియోగించడానికి వీలులేని పాత వాహనాలను సైతం రవాణా శాఖ ఆధ్వర్యంలో వేలం వేయనున్నారు. వేలం ద్వారా వచ్చిన నగదును ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నారు. కొన్ని కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లో శిథిలావస్థకు చేరిన భవనాలు ఉన్నాయి. వాటిని కూల్చడానికి అనుమతుల కోసం ఏళ్లుగా వేచిచూస్తున్నారు. అలాంటి భవనాల సామర్థ్యాన్ని పరిశీలించి కూలడానికి సిద్ధంగా ఉన్నవాటిని అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకొని తొలగించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన కొన్ని నోటీసులు, సిబ్బంది అనుమతి పత్రాలు వంటివి నిర్ణీత కాలం తర్వాత భద్రపరచాల్సిన అవసరం ఉండదు. అలాంటివి పేరుకుపోయి ఉంటాయి. భద్రపరచాల్సిన అవసరం లేని కాగితాలను పరిశీలన తర్వాత కాల్చివేయనున్నారు. ఇలా ఉగాది నాటికి అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో అనవసర వ్యర్థాలు, భవనాలు, వాహనాలు, కాగితాలు తొలగి కొత్త శోభను సంతరించుకోనున్నాయి.



చిలకలూరిపేటలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో పాత వాహనం

ఉగాది నాటికి కొత్త శోభ



ప్రభుత్వ కార్యాలయాల్లో ఏళ్లుగా వివిధ రకాల వ్యర్థాలు పేరుకుపోయి సిబ్బంది, ప్రజలకు ఇబ్బందిగా మారిపోయాయి. వాటిని తొలగించేందుకు వివిధ కారణాలతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మిషన్ శోభకృత్ ద్వారా వచ్చే నెలలో రానున్న ఉగాది నాటికి వ్యర్థాలను తొలగించి కొత్త శోభను తీసుకురానున్నాం. ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సహకారంతో విజయవంతం చేయడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయనున్నాం. మిషన్ శుభకృత్‌తో పల్నాడు జిల్లా ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తాం.

– శివశంకర్ లోతేటి, కలెక్టర్, పల్నాడు జిల్లా



పిడుగురాళ్ల గురుకుల పాఠశాలలోని ఓ గదిలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఈ చిత్రంలో కనిపిస్తున్న గది పిడుగురాళ్ల ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలోనిది. ఇందులో కనిపిస్తున్నవి విద్యార్థులు గతంలో వాడిన ట్రంకు పెట్టెలు, పాత కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లు. ఈ పాత సామగ్రితో ఆ గది మొత్తం పూర్తిగా నిండిపోవడంతో విద్యార్థులకు ఉపయోగం లేకుండా పోతోంది. వీటిని అమ్మడం లేదా తొలగిస్తే విద్యార్థులకు మరో గది ఉపయోగంలోకి వస్తుంది. ఇక్కడేకాదు దాదాపు చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇదే తంతు. అధికారులు వీటిని అమ్మాలంటే చాలా తతంగమే ఉంటుంది. మరోవైపు కొందరి నిర్లక్ష్యం వెరసి ఏళ్ల పాటు ఈ వ్యర్థాలు తిష్టవేసి ఉంటున్నాయి. వ్యర్థాలను తొలగించి లేక విక్రయించి ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు ఓ కొత్త కార్యక్రమానికి పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శ్రీకారం చుట్టనున్నారు. మిషన్ శోభకృత్‌ను ప్రారంభించనున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. మాఘమాసం శుభముహూర్తాన ఒక్కటైన నవ వధూ వరులు పెళ్లి బట్టలపై అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భక్తులు కుటుంబ సమేతంగా చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపున అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవలలో ఉభయదాతలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, చక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమం, పంచహారతుల సేవలకు భక్తులు, ఉభయదాతలు హాజరయ్యారు. ఈవో భ్రమరాంబ, చైర్మన్ కర్నాటి రాంబాబు క్యూలైన్లను పర్యవేక్షించారు. లక్ష్మీ గణపతి ప్రాంగణంలో భక్తులు ఎండలోనే వేచి ఉండాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చలువ పందిళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. తాత్కాలికంగా షామియానాను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబుతో పాటు పాలక మండలి సభ్యులు ఆదివారం మహా మండపం మెట్ల మార్గం ద్వారా ఆలయానికి చేరుకున్నారు. కొండపైకి చేరుకునే తరుణంలో భక్తులతో పాలక మండలి సభ్యులు మాట్లాడారు. మెట్ల మార్గంలో తాగునీటి సదుపాయం కల్పించాలని, క్యూలైన్లను పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. క్యూలైన్లను పరిశీలించిన వారిలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవి, చింతా సింహాచలం, చింక శ్రీనివాస్, డీఈఈ సత్యనారాయణ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు పెద్దపీట



చేతులు కలిపి ఐక్యత చాటుతున్న రాష్ట్ర, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ నాయకులు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- బీపీ మండల్ విగ్రహావిష్కరణ, బీసీల ఆత్మగౌరవ సభ

గుంటూరు రూరల్: రాష్ట్ర చట్ట సభల్లో బీసీలకు పెద్దపీట వేసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ స్పష్టం చేశారు. ఆదివారం నగర శివారుల్లోని అమరావతి రోడ్డు చిల్లీస్ సెంటర్‌లో బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణను విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం బీసీల ఆత్మగౌరవ సభను ఇన్నర్ రింగ్ రోడ్డులో జరిపారు. ఈ సందర్భంగా మంత్రి చెల్లుబోయిన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు రాష్ట్రంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని, కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో బీసీల అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని చెప్పారు.

బీసీల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలి

బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని కోరారు. బీసీల అభివృద్ధి కోసం బీపీ మండల్ దేశ వ్యాప్తంగా పర్యటనలు చేసి ఎన్నో సంస్కరణలు ప్రతిపాదించారని, అయితే దానిని కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల అభివృద్ధి జరగాలంటే నాడు బీపీ మండల్ ప్రవేశపెట్టిన సంస్కరణలు అమలు జరగాలన్నారు. బీసీల జనగణన జరిపి దానిప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.



సత్కారం పొందుతున్న విగ్రహ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఆలా వెంకటేశ్వర్లు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే బీసీలకు మేలు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ దేశలో ఎక్కడా లేని విధంగా బీసీలకు మంత్రి పదవులు, చట్ట సభల్లో ప్రాధాన్యత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కల్పించారని చెప్పారు. బీపీ మండల్ బీసీల అభివృద్ధికి ప్రతిపాదించిన సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు. బీసీల జనగణన చేపట్టాలని, బీసీలంతా ఐకమత్యంగా ఒక వేదికపై చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. ఐకమత్యంగా ఉంటేనే విజయాలు సొంతమవుతాయన్నారు. ఎంపీ బీద మస్తానరావు మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే కృషి చేశారని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం బీసీలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. బీసీ కుటుంబాల అభివృద్ధికి జగనన్న అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని, రాష్ట్రానికి బ్యాక్ బోన్ అనే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. ద్రావిడ ఖజగం అధ్యక్షుడు వీరమణి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి ఒక్క వైఎస్ జగన్ మాత్రమేనని కొనియాడారు. తమిళనాడు ఎంపీ తిరుమావళన్ మాట్లాడతూ ఆంధ్రప్రదేశలో మాత్రమే బీసీల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రతి రాష్ట్రంలో ఆయనను ఆదర్శంగా తీసుకుని బీసీల అభివృద్ధికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ బీసీల అభివృద్ధి జరగాలంటే జనగణన ద్వారా సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్యవరప్రసాద్, కల్పలతారెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధరరావు, నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, క్రాంతి కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, మాజీ మంత్రి అజయ్ సింగ్, పలు రాష్ట్రాల మంత్రులు, మాజీ మంత్రులు తదితరులు పాల్గొన్నారు. బీసీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ బీసీలు ఐకమత్యంగా ఉండి రిజర్వేషన్ల కోసం కృషి చేయాలని కోరారు.

రేపటికి కొండ దారులు సిద్ధం

- కోటప్పకొండలో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- తిరునాళ్ల పనుల పరిశీలన



యల్లమంద వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా చేపట్టిన రోడ్ల విస్తరణ, మరమ్మతు పనులు ఈ నెల 14వ తేదీలోగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ కోటప్పకొండలో నిర్వహించనున్న తిరునాళ్ల ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పరిశీలించారు. కోటప్పకొండ నుంచి నరసరావుపేట వరకు రూ.17 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. యల్లమంద బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేస్తున్న అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రభలు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. చిలకలూరిపేట మేజర్ వద్ద చిన్మయ ఆశ్రమం వెనుక వైపు నుంచి తాత్కాలిక రోడ్డు పనులను పరిశీలించారు. రెడ్ల సత్రం నుంచి చిలకలూరిపేట మేజర్ వరకు ట్రాఫిక్ నియంత్రణ ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రభలను మాత్రమే కాలువపై ఉన్న బ్రిడ్జిపై నుంచి అనుమతివ్వాలని, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను కెనాల్ మీద నుంచి చిన్మయ ఆశ్రయం వెనుక వైపు నుంచి ఏర్పాటు చేస్తున్న రోడ్డు నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. కెనాల్ వద్ద ఏర్పాటు చేసే స్నానాల ఘాట్‌ను విశాలంగా, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోటప్పకొండ నుంచి పమిడిమర్రు మీదగా జేఎన్‌టీయూ కళాశాల వరకు నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించి నాణ్యతతో పనులు పూర్తిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ యల్లమంద బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డును బీటీతో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. అప్రోచ్ రోడ్డుపై కొంత మంది చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ప్రభల నిర్వాహకులకు సూచించారు. ప్రభల నిర్వాహకులు ఒకసారి బ్రిడ్జి వద్దకు వచ్చి అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించుకోవాలని సూచించారు. కోటప్పకొండ నుంచి పమిడిమర్రు–వినుకొండ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రస్తుతం బీటీ వేస్తున్నారని ఈ నెల 14వ తేదీకి పనులు పూర్తవుతాయని తెలిపారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండేందుకు రహదారులను సిద్ధం చేస్తున్నామన్నారు. తిరునాళ్ల ఏర్పాట్లపై ఈ నెల 14వ తేదీ కోటప్పకొండలో మూడవ సమీక్షా సమావేశం ఉంటుందని, అప్పటికీ అన్ని పనులు పూర్తిచేస్తామని తెలిపారు. ఈ నెల 16వ తేదీ కొండమీద చేపట్టిన అన్నదానమండపం, డార్మెటరీ, వసతి గృహాలు, ఆలయం చుట్టూ రేకుల షెడ్డు, కొండ దిగువున సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు వెన్నపూస నాగిరెడ్డి, దాసరి శ్రీనివాసరావు, మేకల మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు మూరే రవీంద్రారెడ్డి, కనకా పుల్లారెడ్డి, వంపుగుడి జాన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో ఉన్నత శిఖరాలు

పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

పిడుగురాళ్ల: ప్రతి విద్యార్థి చదువుతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. పట్టణంలోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పోష్టికాహారం, భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను తెలుసుకునేందుకు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమకు సోషల్, ఫిజిక్స్ టీచర్‌లు అవసరమని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్ వెంటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే లక్ష్యంతో గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను అందిస్తోందన్నారు. ప్రతి శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ డేగా ఏర్పాటు చేసి గురుకులాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. పల్నాడు జిల్లాలో అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను ఒకచోటకు చేర్చి వేలంపాట నిర్వహించటం జరుగుతుందన్నారు. త్వరలోనే బాలసదనం భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు నిరీక్షించేందుకు నీడ ఉన్న ప్రాంతంలో బెంచీలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కాశయ్యకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నవరత్నకుమారి, హాస్టల్ వార్డెన్ వనజ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో సామాజిక చైతన్యం

- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు
- మల్లంపల్లి సోమశేఖర శర్మ వ్యాసాల సంకలనం ఆవిష్కరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పుస్తక పఠనంతో సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. పుస్తకాలు భాషా సంస్కృతులకు ప్రతిబింబాలని చెప్పారు. పుస్తక మహోత్సవంలో భాగంగా సుప్రసిద్ధ కవి ముదివర్తి కొండమాచార్యుల శత జయంతి సభ ఆదివారం రాత్రి గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు కొండమాచార్యులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లంపల్లి సోమశేఖరశర్మ వ్యాసాల సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రదేశ చరిత్రనే తన జీవితంగా మలచుకున్న ఘనత సోమశేఖరశర్మ సొంతమన్నారు. ఐఏఎస్ అధికారి బుడితి రాజశేఖర్, సాహితీవేత్త వాడ్రేవు చిన వీరభద్రుడు, ఎమెస్కో సంపాదకులు డాక్టర్ డి.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. పబ్లిషర్ డి.విజయకుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యాశాఖ స్టాల్స్ సందర్శన...

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వెంకయ్యనాయుడు పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు గమనించారు. విద్యా శాఖ పథకాలు, నాడు–నేడు అభివృద్ధి పనుల ఫొటోలు తిలకించారు.

కవులకు సాహితీ పురస్కారాలు ప్రదానం

ప్రముఖ కవి అరుణ్‌సాగర్ స్మారకార్థం కవులకు సాహితీ పురస్కారాలు ప్రదానం చేశారు. రచయిత్రి జాన్సీకి సాహితీ మిత్ర, న్యాయవాది సాయికి స్నేహ మిత్ర, జర్నలిస్టు తులసీచంద్‌కు యువజర్నలిస్టు పురస్కారాలు అందించారు. చినుకు పత్రిక సంపాదకులు రాజగోపాల్ అరుణ్‌సాగర్ సాహితీ సేవలను కొనియాడారు. 'రష్యన్ – తెలుగు అనువాద సాహిత్యం' చెకోవ్ కరచుజోన్ పుస్తకాల పరిచయ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు.



మల్లంపల్లి సోమశేఖర్ శర్మ వ్యాసాల సంకలనం ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు తదితరులు

సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ బలం

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ బలం అని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) పేర్కొన్నారు. మాచర్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని శ్రీరాంపురం తండాకు చెందిన టీడీపీ నాయకులు ఆదివారం పీఆర్కే సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ నవరత్నాల పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడి పార్టీలో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచి దేరంగుల ఏగయ్య, మాజీ సర్పంచి కేతావత్ హనుమా నాయక్‌ల ఆధ్వర్యంలో పార్టీలో తండాకు చెందిన మంజుల రామకృష్ణ, మంజుల రవి, ఆంజనేయులు, ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, బత్తుల హనుమయ్య, షేక్ సైదా, వడితె వెంకటేశ్వర నాయక్, మస్తాన్‌వలి చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, బూడిద శ్రీను, ఉప్పుతోళ్ల ఏడుకొండలు, తోట ఆంజనేయులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే


కన్నెగండ్ల టీడీపీకార్యకర్తలకు కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

జగనన్న సంక్షేమ పథకాలకు ప్రజల మద్దతు

పెదకూరపాడు(అమరావతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల మద్దతు లభిస్తోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కన్నెగండ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారీ స్థాయిలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలన నచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని చెప్పారు. జగనన్న మరోసారి సీఎంను చేయటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో పెద్దింటి భాస్కరరావు, కోరంపల్లి వీరవసంతరావు, శనగవరపు శివన్నారాయణ, నరేష్, చల్లగిరి రామారావు, తొర్రికుంట వెంకటేశ్వర్లు, షేక్ పీర్‌సాహెబ్, షేక్ ఖాశింపీరా, రాయపూడి చెన్నకేశవులు, కోరంపల్లి వెంకటేశ్వరరావు, ఆకారపు పర్వతాలు, బొమ్మెన వీరవెంకటేశ్వర్లు, బొమ్మెన వెంకయ్య, నాగేశ్వరరావు, మద్దికుంట శివన్నారాయణ, బొమ్మెన ప్రసాద్, మద్దికుంట వెంకటేశ్వర్లు, తాత్రాసుపల్లి వెంకటేశ్వరరావు, ప్రొద్దుటూరి రమణారావు, కాసారబడ హరిబాబు, గోగులపాటి కృష్ణారావుతో బాటుగా సుమారు ఇరవై ఐదుకుటుంబాలవారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దింటి వెంకటరావు, బాపయ్య, షేక్ కరీం, బచ్చు హనుమంతరావు, బత్తుల రవీంద్ర, షేక్ సుభాని పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు


రెండు పళ్ల విభాగంలో ప్రథమ బహుమతిని గెలుపొందిన ఎడ్ల జత

సత్రశాల(రెంటచింతల): జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన పోటీలలో రెండు పళ్ల సైజ్ విభాగంలో పోటీలు ఆదివారం ఉత్కంఠగా సాగాయి. మహాశివరాత్రి సందర్భంగా సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం సమీపంలోని శ్రీ శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రంలో ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలలో గుంటూరు జిల్లా గోళ్లముడిపాడు గ్రామానికి చెందిన ఉప్పల లక్ష్మయ్య చౌదరి, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి గిత్తలు 4,437.04 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.25 వేలు గెలుపొందాయి. కృష్ణా జిల్లా తెంపల్లి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ దేవతారావు ఎడ్లు 4,372.08 అడుగుల దూరం లాగి రెండో బహుమతి రూ.20 వేలు బహుమతిని దక్కించుకున్నాయి. ఖమ్మం జిల్లా పాత లింగాల గ్రామానికి చెందిన రామ్‌రెడ్డి దామోదర్‌రెడ్డి, పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామానికి చెందిన పిల్లిగడ్డపు రెహనా ఎడ్లు 4,178.03 అడుగుల దూరం లాగి 3వ బహుమతి రూ.15 వేలు గెలుపొందాయి. గుంటూరు జిల్లా గణికపూడి గ్రామానికి చెందిన కల్లూరి ప్రవీణ్‌కుమార్ గిత్తలు 4,087 అడుగుల దూరం లాగి 4వ బహుమతి రూ.10 వేలు, పాత మల్లయ్యపాలేనికి చెందిన సిద్దంశెట్టి సామ్రాజ్యం, కొండ బాలవారిపాలెం గ్రామానికి చెందిన గూడవల్లి లక్ష్మీ దీక్షిత ఎడ్లు 4,051.09 అడుగుల దూరం లాగి 5వ బహుమతి రూ.8 వేలు, గొల్లమూడుపాడు గ్రామానికి చెందిన ఉప్పల లక్ష్మయ్య చౌదరి, తోటపాలేనికి చెందిన రామనేని రత్తయ్య చౌదరి గిత్తలు 3,600 అడుగులు లాగి 6వ బహుమతి రూ.6 వేలను దక్కించుకున్నాయి. మొత్తం ఈ విభాగంలో 9 జతల ఎడ్లు పోటీలలో పాల్గొన్నాయి.

కమిటీ సభ్యులు పులి ఓబుల్ రెడ్డి, యర్రెడ్డు శ్రీనివాసరెడ్డి, పత్తి కోటిరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, దొండేటి వెంకటేశ్వరరెడ్డి, చింతా శివారెడ్డి, గాదె వీరారెడ్డి, సిద్దవటం శివారెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి పర్యవేక్షించారు. మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మిట్టగుడిపాడు సర్పంచి గొట్టం ప్రమీలాగురవారెడ్డి, నాగిరెడ్డి అంజిరెడ్డి, జడ్డా శ్రీనివాసరెడ్డి, కొత్తూరు సర్పంచి మద్దిగపు అచ్చిరెడ్డి, శ్యామల వెంకట నారపరెడ్డి, వెంకటరెడ్డి, గాదె వెంకటేశ్వరరెడ్డి విజేతలైన ఎడ్ల యజమానులకు వరుసగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షులు పశర్లపాడు బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

చర్చనీయాంశమైన శివాలయంలో బాలిక వివాహం

పెదకాకాని: శివాలయంలో బాలిక వివాహం చర్చనీయాంశమైంది. స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో ఫిబ్రవరి 12 ఉదయం వివాహం జరుపుకునేందుకు 20 రోజుల కిందట గుంటూరుకు చెందిన వారు బుక్ చేసుకున్నారు. శనివారం రాత్రి వధూవరులతో బంధువులు ఆలయానికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయ కౌంటర్‌లో వివాహ రశీదు పొందేందుకు పేర్లు నమోదు చేయించుకుంటున్న సమయంలో పెళ్లి కూతురు వయస్సు 18 ఏళ్లు నిండడానికి నాలుగు నెలల తక్కువగా ఉంది. నిబంధనల ప్రకారం రశీదు రాసేందుకు కౌంటర్‌లో ఉన్న వ్యక్తి నిరాకరించాడు. అప్పటికే కల్యాణ మండపం డెకరేషన్, లైటింగ్, బాజాభజంత్రీలతో మాట్లాడుకున్న వారు ఎవరికీ చెప్పకుండా వివాహం చేసేశారు. అనంతరం కల్యాణ మండపం అద్దె రూ.17,500ను అక్కడే ఉన్న ఆలయ సిబ్బందికి ఇచ్చి వెళ్లిపోయారు. ఆ తరువాత బాలికకు వివాహం జరిగినట్లు బహిర్గతం కావడంతో చర్చనీయాంశమైంది. దీంతో ఆలయ అధికారులు పెళ్లి కుమారుడిని పిలిపించి, వివరణ కోరారు. సోమవారం వయసు ధ్రువీకరణ సంబంధించిన చదువుల సర్టిఫికెట్లు అందజేస్తానని చెప్పడంతో సమస్యకు తెరపడినట్లయింది.

ఏపీఆర్‌జేసీకి పుస్తకాల వితరణ


పుస్తకాలు అందజేస్తున్న సురేంద్రమోహన్

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలకు రూ.3లక్షల విలువైన పుస్తకాలను ఆదివారం పూర్వవిద్యార్థులు అందజేశారు. 1985–87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సెక్రటరీ సురేంద్రమోహన్ ఆర్థిక సాయంతో పుస్తకాలను ప్రిన్సిపాల్ జి.రంగాచార్యులకు అందజేశారు. సురేంద్రమోహన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా సర్వేల్ గురుకుల పాఠశాలలో తనతో పాటు చదివి ప్రస్తుతం ముంబాయిలో సింసం ఫార్మా కంపెనీ డాక్టర్ పి.సత్యనారాయణరావు, నోబెల్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ సురేష్ విద్యార్థులకు అవసరమైన కాంపిటేటివ్ ఎగ్జామ్స్, ఎంసెట్, నీట్, ఐఐటీ, సీఏ, సీపీటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను స్పాన్సర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మల్లుస్వామి, వైఎస్సార్ సీపీ నాయకుడు రంగ, సర్వేల్ పాఠశాల పూర్వ విద్యార్థులు సునీల్ రవీంద్ర పాల్గొన్నారు.

టీడీపీకి ఓటమి తథ్యం

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు నాయక్



వెల్దుర్తి: వచ్చే ఎన్నికల్లో అధికారం మాదేనని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పగటి కలలు కంటున్నారని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్ ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తనయుడు లోకేష్ పాదయాత్ర జనం లేక పోవటంతో వెలవెలబోతుందన్న వాస్తవాలను జీర్ణించుకోలేని స్థితిలో ఈ రోజు ఆ పార్టీ నాయకత్వం ఉందన్నారు. పార్టీ నేతలపై చంద్రబాబు చిందులు తొక్కుతున్నారని పేర్కొన్నారు. ఒకవైపు లోకేష్ పాదయాత్రకు జనం రావడం లేదని చంద్రబాబు అచ్చెన్నాయుడు బాధపడుతూనే మరోవైపు 160 సీట్లు సాధించబోతున్నామని గొప్పలు చెప్పుకోవటం విడ్డూరంగా ఉందని చెప్పారు. 2014 ఎన్నికలలో అబద్ధపు హామీలతో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్‌లో నుంచి తీసేసిన ఘనత దేశంలో చంద్రబాబు నాయుడుది అని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ 2019 ఎన్నికలలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాలలోపే 98.5 శాతం అమలు చేసిన ఘనత దేశంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అధికారం కోసం చంద్రబాబు, లోకేష్ ఎన్ని కుయుక్తులు పన్నినా మాయమాటలు చెప్పినా వారిని రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరన్న వాస్తవాన్ని అర్థం చేసుకోవాలన్నారు. 2024లో కూడా సీఎం జగన్‌ని ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నాయక్ చెప్పారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల రద్దీ


ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


శ్రీశైల మల్లన్న తలపాగాకు ప్రత్యేక పూజలు


తలపాగాను తీసుకు వెళుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

తాడేపల్లి రూరల్ : మంగళగిరిలోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీ శైలం మల్లన్న తలపాగాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మల్లన్న తలపాగాను తమ శిరస్సులపై ఉంచుకుని భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా లావేరులో తయారు చేసిన శ్రీ శైల మల్లన్న తలపాగాను మంగళగిరిలో భక్తుల దర్శనార్థం అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ఉంచడం అభినందనీయమని తెలిపారు. ఆయన తలపాగాను తాకడం పూర్వజన్మ సుకృతమని వారు పేర్కొన్నారు. శివరాత్రి ఉత్సవాల్లో మల్లికార్జునస్వామికి అర్ధరాత్రి లింగోద్భవ కాలానికి ముందు తలపాగా అలంకరించే ఘట్టం అత్యంత విశిష్టమైనదని తెలిపారు. సుమారు 200 ఏళ్ల నుంచి శ్రీశైలంలో ఈ సంప్రదాయం కొనసాగుతోందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మునగాల మల్లేశ్వరరావు, దేవాంగ సంఘ అధ్యక్షుడు బుల్లా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి అలక తాతారావు, కోశాధికారి అలక నమశ్శివాయ, మునగపాటి వెంకటేశ్వరరావు, నేరెళ్ల మురళి, పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద వరప్రసాద్ పాల్గొన్నారు.

పసుపు సాగుపై రైతుల ఆసక్తి

- లాభాల పంట..
- కేరాఫ్‌గా కొత్తరెడ్డిపాలెం
- సాగులో మూడో స్థానం అద్దంకి
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రంతో రైతుల ఆనందం
- జిల్లాలో 2,882 ఎకరాల్లో సాగు


కొత్తరెడ్డిపాలెంలో సాగు చేసిన పసుపు పంట

అద్దంకి: రైతులు సంప్రదాయ పంటలను తగ్గించి వాణిజ్య పంటల సాగుతో లాభాలు ఆర్జిస్తున్నారు. ఆధునిక పద్ధతుల్లో జిల్లాలో 2,882 ఎకరాల్లో పసుపు పంటను సాగు చేస్తుండగా, ఐదారేళ్ల నుంచి అద్దంకి మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో రైతులు పసుపు పంటను సాగు చేస్తూ అధిక దిగుబడులతో లాభాలు సాధిస్తున్నారు. ఏటికేడు పంట విస్తీర్ణం పెరిగి జిల్లాలో పసుపు సాగులో అద్దంకిని మూడో స్థానంలో నిలిపారు కొత్తరెడ్డిపాలెం రైతులు. పసుపు సాగుకు గుంటూరు జిల్లా దుగ్గిరాల పెట్టింది పేరు. అత్యధిక పసుపు పంట సాగుతో కొత్తరెడ్డిపాలెం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రథమ స్థానంలోనూ బాపట్ల జిల్లాలో మూడో స్థానంలో నిలిచింది. ఐదారేళ్ల క్రితం ఐదు ఎకరాలతో గ్రామంలో ప్రారంభమైన పసుపు పంట ప్రస్తుతం 150 ఎకరాలకు చేరింది. ఈ గ్రామంలో ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల పసుపు కొమ్ముల దిగుబడిని సాధించిన రైతులున్నారు.

దుగ్గిరాల కొమ్ములతో సాగు..

కొత్తరెడ్డిపాలెం ఓ చిన్న గ్రామం ఈ గ్రామంలో రైతులు కొందరు పాత కాలంలో పసుపు సాగు చేసి ఆశించిన లాభాలు రాక పంట సాగును మానుకున్నారు. ఐదారేళ్ల క్రితం ఉద్యాన శాఖ అధికారుల ప్రోత్సాహంతో ఐదు ఎకరాల్లో పంట సాగు ప్రారంభమై మంచి లాభాలు రావడంతో ప్రస్తుతం 150 ఎకరాలకు చేరింది. దీంతో సంతమాగులూరు మండలంతోపాటు, అద్దంకి మండలంలోని ఇతర గ్రామాల్లోనూ పసుపు పంటను సాగు చేయడం మొదలు పెట్టారు. ఇక్కడి రైతులు గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల ప్రాంతం నుంచి పసుపు విత్తనం కొనుగోలు చేసి తీసుకొస్తారు. డ్రిప్ పద్ధతిలో పంట సాగుతో మొదటి ఏడాదిలో గ్రామానికి చెందిన చింతా వెంకట సుబ్బారెడ్డి ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడిని తీసి, అప్పట్లో ప్రకాశం జిల్లాలోనే టాప్‌గా నిలిచాడు. మిగిలిన రైతులకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. వారిని ఆదర్శంగా తీసుకుని సాగు చేస్తున్న మిగిలిన రైతులు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం సాధిస్తున్నారు.

కొనుగోలు కేంద్రంతో మద్దతు ధర..

పసుపు పంట ఎక్కువగా పండిస్తున్న గ్రామం ఉండటంతో గతేడాది అద్దంకిలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. క్వింటాలుకు రూ.6,850 మద్దతు ధర కల్పించారు. దీంతో పెట్టుబడి పోను సరాసరిన 30 క్వింటాళ్ల లెక్కన రూ.2.5 లక్షల వస్తున్నాయి. పెట్టుబడులు పోను రూ.లక్ష వరకు నికర ఆదాయం వస్తుందని రైతు రామాంజిరెడ్డి చెబుతున్నారు.

మనసున్న ముఖ్యమంత్రి జగన్

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్
- జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన డీఎస్సీ 1998 అభ్యర్థులు


ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

నగరంపాలెం: మనసున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ కొనియాడారు. ఏపీ డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు కొరిటెపాడు రోడ్డులోని వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద సీఎం వై.ఎస్.జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజా సంకల్ప యాత్రలో డీఎస్సీ 1998 అభ్యర్థుల గాథను ఆలకించారని, అధికారంలోకి వచ్చాక సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ క్రమంలో ఓ కమిటీ వేశారని, అది ఇచ్చిన నివేదిక ఆధారంగా చేసుకుని డీఎస్సీ 1998 అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు ఇచ్చారని తెలిపారు. సంఘ రాష్ట్ర నేత సాయిరాం మాట్లాడుతూ గడిచిన 24 ఏళ్లుగా ఉద్యోగాల కోసం అనేక ఉద్యమాలు చేపట్టామని చెప్పారు.సుమారు ఏడుగురు ముఖ్యమంత్రుల్ని కలసి తమ సమస్యను విన్నవించినా ప్రయోజనం లేదని వాపోయారు. నేడు సీఎం జగన్ 4,534 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సీతారామిరెడ్డి, శ్రీనివాస్, అనురాధ, లేళ్ల కోటేశ్వరరావు, ఆదాం, భారతి, సుహాసిని పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటాలు: ఏపీటీఎఫ్


ఉద్యమ కరపత్రాలతో ఏపీటీఎఫ్ నాయకులు

నగరంపాలెం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటాలు చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి షేక్.జిలాని తెలిపారు. కోర్టు రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సీపీఎస్ రద్దును అమలు చేయలేదని తెలిపారు. రివర్స్ పీఆర్సీ ఇచ్చి మోసగించిందని ఆరోపించారు. న్యాయమైన హామీల్ని అమలు చేసి, 2013 జూలై 1 నుంచి ప్రారంభమయ్యే 12వ పీఆర్సీకి కమిషన్ నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు మాట్లాడుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు సత్వరమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉద్యమ కరపత్రాల్ని ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పుట్టా జనార్దన్, జిల్లా కార్యదర్శులు ఎస్.రాంబాబు, వై.పూర్ణచంద్రరావు, కె.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సత్యనారాయణమూర్తి, గౌస్, హుస్సేన్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేటి ఆహార పద్ధతులే అనారోగ్యాలకు మూలం

డాక్టర్ ఖాదర్‌వలి



సభలో మాట్లాడుతున్న ఖాదర్‌వలి

పాత గుంటూరు: విదేశీ మోజులో పడి మన సిరిధాన్యాల్ని అశ్రద్ధ చేయడమే నేటి మన అనారోగ్యాలకు మూలమని స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి స్పష్టం చేశారు. గడచిన వందేళ్లలో మారిన జీవన విధానం, ఆహార ఉత్పత్తి పద్ధతి, తీసుకునే ఆహారంలో చోటు చేసుకున్న మార్పులే ఈ విపత్తుకి కారణమని చెప్పారు. రాజాగారితోటలోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన, వంటకాలపై శిక్షణ, మిల్లెట్ మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పలువురు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. వివిధ రకాల కారణాల వల్ల మన ఆహారంలో వరి, గోధుమలు చేరి చిరుధాన్యాల్ని పక్కకు నెట్టడమే దీనికి కారణమని పేర్కొన్నారు. రుచిగా ఉండటం లేదని, వీటిని ఆహారంలో చేర్చుకోలేకపోతూ ఆరోగ్యాల్ని పాడు చేసుకుంటున్నారని చెప్పారు. మిల్లెట్ రాంబాబు మాట్లాడుతూ శ్రద్ధతో వంట చేసుకున్నట్లయితే చిరుధాన్యాలతో రుచికరమైన వంటకాలు చేసుకోవచ్చని, వీటితోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు యలమంచిలి శివాజీ, భారతీయ కిసాన్‌సంఘ్ కార్యవర్గ సభ్యుడు కుమారస్వామి, నేరెళ్ల తిరుపతిరావు, రైతు నేస్తం ఫౌండేషన్‌చైర్మన్‌యడ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును అందించిన సందర్భంగా ఖాదర్‌వలీని ఘనంగా సత్కరించారు.